## కాంగ్రెస్‌లోకి బిజెపి నాయకులు?

**న్యాల్‌కల్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** రెండు దశాబ్దాలకు పైగా పార్టీ జండాను మోసినా గుర్తింపు లేకపోవడంతో పార్టీ మండల మాజీ ప్రధాన కార్యదర్శి తిర్లపురం గోపాల్ తన అనుచులతో కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు చర్చలు జరుపుతున్నట్లు మండలంలో ప్రచారం సాగుతోంది. మండలంలోని ఖలీల్‌పూర్‌కు చెంది గోపాల్ యాదవ్ మండల పార్టీ మాజీ అధ్యక్షులు, స్వర్గీయ రాజేందర్‌పాటిల్ ఆధ్వర్యంలో మండలంలో పార్టీ అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని చెప్పవచ్చు. రాజేందర్ పాటిల్ తిరిగి రాని లోకాలకు చేరిపోవడం, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకుల నుంచి ఎలాంటి సమాచారాలు అందకపోతుండటంతో పార్టీ నాయకులపై విసుగుచెంది మండలంలోని పార్టీ అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లోకి చేరేందుకు సన్నహాలు కొనసాగుతున్నాయి. బిజెపి నాయకులు గోపాల్‌ను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు కొత్తపల్లి భాస్కర్‌రెడ్డిలు అనుచులతో కలిసి కాంగ్రెస్‌లో చేరితే భవిష్యత్తు బంగారు మయంగా ఉంటుంది. త్వరోలనే గంగ్వార్ చౌరస్తాలో ఏర్పాటు చేసే కార్యాక్రమంలో తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ తీర్థం పుచుకోనున్నట్లు తెలుస్తోంది.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## ఓటరు నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ శరత్

**సంగారెడ్డి మున్సిపాలిటి ఆగస్టు 31,ప్రభాతవార్త**

ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.శరత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 1,2023 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారందరు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సెప్టెంబరు 2, 3వతేదీలలో జిల్లాలో ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని అన్నారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో బూత్‌స్థాయి అధికారులు బిఎస్‌ఓలు ఉదయం 10గంటల నుండి ఓటరు జాబితాతో ప్రజలకు అందుబాటులో ఉంటారని అన్నారు. జాబితాలో మార్పులు, చేర్పులు, సవ రణలు చేయాలనుకునేవారు ఫారం 8, కోత్త ఓటరు నమోదుకు ఫారం 6,పేరు తోలిగింపునకు ఫారం 7ను ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు.ప్రత్యేక శిభిరాలను ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలని,అర్హత గల ప్రతి ఒక్కరు తమ పేరు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కలెక్టర్ ఎ.శరత్ ప్రకటనలో కోరారు.

## జిల్లాలో 30, 30(ఎ) పోలీస్ యాక్ట్

### జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

**మెదక్ అర్బన్, ఆగస్టు31 ప్రభాతవార్త:** జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని సెప్టెంబర్ 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. అలాగే ప్రజా ధనాన్ని నష్టం కలిగించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్పీ హెచ్చరిం చారు. కాబట్టి జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు తమకు ఈ విషయంలో సహకరించాలని తెలిపారు.

## నీలం మధుకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలి



నీలం మధుకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలంటూ కిష్టారెడ్డిపేటలో రాస్తారోకో చేస్తున్న దృశ్యం

**అమీన్‌పూర్, ఆగస్టు31 ప్రభాతవార్త:** పటాన్‌చెరు నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ బీసీ నేత, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్‌కు కేటాయించాలని బీసీ సంఘాల ఆధ్వర్యంలో గురువారం అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ బీసీ నేత, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్‌కు పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలంటూ గత వారం రోజులుగా నీలం మధుకు మద్ధతుగా సబ్బండ వర్గాల నరపజలు, కుల సఘాలు, నాయకులు, యువత ఏకమవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా 65 లోల జనాభా ఉన్న ముదిరాజ్ సామాజిక వర్గాన్ని సీఎం కేసీఆర్ విస్మరించడం పట్ల ఆ వర్గం ప్రజలతో పాటు మిగిలిన బీసీ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గత నాలుగు సంవత్సరాలుగా పటాన్‌చెరు నియోజకవర్గమే కాకుండా జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి అవిశ్రాంతంగా కృషి చేస్తూ అనుక్షణం ప్రజలతో మమేకమై ఉంటున్న నీలం మధు ముదిరాజ్‌కు సీఎం కేసీఆర్ టికెట్ నిరాకరించడం సరికాదన్నారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి ఇవ్వడంపై సీఎం కేసీఆర్‌పై బీసీ సంఘాలు అసహనం వ్యక్తం చేశాయి. పటాన్‌చెరు నియోజకవర్గ టికెట్‌పై ఇకనైనా సీఎం కేసీఆర్ పునరాలోచించి సంబ్బండ వర్గాలందరికీ ఆమోదయోగ్యుడైన నీలం మధు ముదిరాజ్‌కు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తే 65 లక్షల జనాభా కలిగిన ముదిరాజ్ సామాజిక వర్గానికి ప్రత్యక్ష ఎన్నికల్లో అవకాశం కల్పించడం ద్వారా సరైన ప్రాతినిధ్యం దొరుకుతుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. నీలం మధుకు టికెట్ కేటాయిస్తే ఇంటికి ఒకరు ఇంచార్జిగా పనిచేసి గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ మహేష్, బొమ్మనుకుంట వార్డు సభ్యులు రాజు, మన్నె రాములు, ప్రభాకర్, మహేష్, యాదగిరి, బాల్‌రాజ్, భిక్షపతి, కుమార్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## జోగిపేటలో ఘనంగా రాఖీపౌర్ణమి



అందోలు ఎమ్మెల్యే చంటి క్రాంతికిరన్ సోదరులకు రాఖీ కడుతున్న సోదరీమణులు

**జోగిపేట,ఆగస్టు31,ప్రభాతవార్త:** రాఖీపౌర్ణమిని జోగిపేటలో ఘణంగా నిర్వహించారు. గురువారంనాడు అన్నాచెల్లెల్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీపౌర్ణమి పండగను ఘణంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే నూతన వస్త్రాలు ధరించి ఆలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం సోదరులకు రాఖీలు కట్టారు. ఈ పండగ సందర్భంగా పట్టణంలోని రాఖీ వ్యాపారుల వద్ద, మిఠాయి షాపుల వద్ద సందడి నెలకొంది. పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల్లో కూడా విద్యార్థులు రాఖీలు కట్టారు. ఇకపోతే ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కొన్ని వార్డులలో కౌన్సిలర్లు, మరికొన్ని వార్డులలో ఎన్నికల్లో పోటీకి సిద్దంగా ఉన్నవారు ఇంటింటికీ స్వీట్లు పంపిణీ చేసి, వారి నుంచి ఆశీర్వాదాలు తీసుకున్నారు. పట్టణంలోని పదవవార్డులో బిఆర్ఎస్ నాయకులు సాయికుమార్ (పింటు), బృందావన్‌కాలనీలో బిఆర్ఎస్ నాయకులు విజయ్, పన్నెండో వార్డులో కౌన్సిలర్‌లు ఇంటింటికీ స్వీట్ బాక్సులు అందచేశారు.

### శివధనుస్సు ఊరేగింపు

రాఖీపౌర్ణమిని పురస్కరించుకుని ప్రతీ సంవత్సరంలాగే ఈసారి కూడా పద్మశాలీలు పట్టణంలో శివధనుస్సును ఊరేగించారు. పట్టణంలోని చేనేత సహకార సంఘంలోని మార్కండేయ ఆలయంలో ముందుగా పూజలు నిర్వహించిన అనంతరం శివధనుస్సుకు నూతన వస్త్రాన్ని చుట్టి ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలోని క్లాక్‌టవర్, వదినాలమ్మగుడి, పోచమ్మగుడి మీదుగా జోగినాథ ఆలయంకు చేరుకుని అక్కడ పూజలు నిర్వహించారు. ఈ ఊరేగింపులో చేనేత సహకార సంఘం ఛైర్మెన్ వర్కల అశోక్, మాజీ ఛైర్మెన్ పడిగె సత్యంలతోపాటు చేనేత సహకార సంఘం నాయకులు, పద్మశాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.



జోగిపేట పదవ వార్డులో ఇంటింటికీ స్వీట్ బాక్స్ అందజేస్తున్న బిఆర్ఎస్ యూత్ నాయకులు పింటు

# సాంప్రదాయానికి ప్రతీక రాఖీపండుగ



మంత్రి హరీష్‌రావుకు రాఖీ కడుతున్న కార్పోరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి/మిర్‌దొడ్డి/ కొమురవెల్లి/నంగునూరు, ఆగస్టు 31, ప్రభాతవార్త:** అన్నా చెల్లెళ్ళ, అక్క తమ్ముళ్ళ ఆత్మీయ బంధానికి నిదర్శనంగా నిలిచే రాఖీ పండుగను జిల్లాలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. సుదూర ప్రాంతాల నుండి సోదరులకు రాఖీ కట్టడానికి అక్కా, చెల్లెళ్లు రావడంతో ఇంటింటా పండగ సందడి నెలకొంది. సోదరులకు సోదరీమణులు ఆప్యాయంగా రాఖీలు కట్టి బహుమానాలు అందుకున్నారు. పట్టణంలో రాఖీల దుఖాణాలు, స్వీటు హౌస్‌లు కిటకిటలాడాయి. సుదూరంలో ఉన్నవారు.. రావడం వీలులేని వారు పోస్టు ద్వారా, కొరియర్‌ల ద్వారా రాఖీలను అందించారు. ఉద యం నుండే హ్యాపీ రక్షాబంధన్ అంటూ ఎస్ఎంఎస్‌ల సందడి సాయంత్రం దాకా సాగింది. రాఖీ పౌర్ణమితో పాటు శ్రావణ పౌర్ణమి కావడంతో గ్రామాల్లోని దేవాలయాల్లో పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు దర్శించుకున్నారు. పట్టణంలోని పలు దేవాలయంలో శ్రావణ పౌర్ణమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.

### హైదరాబాద్‌లోని మంత్రి స్వగృహంలో..

హైదాదబాద్‌లోని రాష్ట్ర అర్థిక, అరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు స్వగృహంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సిద్దిపేటకు చెందిన బిఆర్ఎస్ మహిళ శ్రేణులు మంత్రి హరీష్‌రావుకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మ ంత్రి హరీష్‌రావు అక్క, చెల్లెళ్లకు పండుగ శుభాకాంక్షలు తెలిపి అందరూ సుఖ:సంతోషాలతో ఉండాలని అకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ మహిళలకు అండగా ఉంటుందన్నారు. మహిళ భద్రత, రక్షణ, సంక్షేమం కోసం ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత నిస్తుందన్నారు.

### బాలసదన్‌లో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

జిల్లా కేంద్రంలోని మెదక్ రోడ్డులో గల బాలసదన్‌లో రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ బాలసదన్ సందర్శించారు. రక్షాబంధన్ సందర ్భంగా బాల సదనంలోని బాలికలు జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్‌కు రాఖీలను కట్టారు. అనంతరం కలెక్టర్ వారికి స్వీట్లు తినిపించి నూతన దుస్తులను పంపిణీ చేసి అశీర్వదించారు. ఎలాంటి సమస్య వచ్చిన తన దృష్టికి తేవాలన్నారు. పిల్లలకు అన్ని వసతులు కల్పించి కన్న బిడ్డల కంటే ఎక్కువ ప్రేమ పంచాలని సిబ్బందికి కలెక్టర్ అదేశించారు. ఇటీవల విక్రయాలకు గురువు పట్టుకుని చేర్చుకున్న పిల్లలు గౌతమ్, తరుణ్‌ల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ శిశు గృహ నూతనంగా నిర్మించిన భవనంలో గదులను కలెక్టర్ పరిశీలించారు. అయన వెంట డీసీపీఓ, బాలసదనం సిబ్బంది తదితరులు ఉన్నారు.

### ఏకో ఫ్రెండ్లీ రాఖీలను కట్టిన : మున్సిపల్ చైర్మన్

రాఖీ పౌర్ణమి సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా మంత్రి తన్నీరు హరీష్‌రావు ఇచ్చిన ఏకో ఫ్రెండ్లీ రాఖీ కార్యక్రమం పిలుపు మేరకు మున్సిపల్ చైర్మన్ కడవెర్గు మంజులరాజనర్సు ఏకో ఫ్రెండ్లీ రాఖీలను కట్టారు. మామిడి, తమల, నవరత్న అకులు, చామంతి, గులాబీ, మొలకెత్తే విత్తనాలతో తయారు చేసిన రాఖీలను మున్సిపల్ చైర్మన్ కట్టారు.

### న్యాల్‌కల్‌లో..

**న్యాల్‌కల్, ఆగస్టు 31 (ప్రభాతవార్త):** రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురష్కరించుకుని మండల జడ్పీటిసి సభ్యురాలు బోడ స్వప్న భాస్కర్ గురువారం ప్రముఖులకు రాఖీలు కట్టి పండగ శుభాకాంక్షలు తెలిపారు. హైద్రాబాద్‌లో రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, జహీరాబాద్ ఎంపి బిబి పాటిల్‌ల నివాస గృహాలకు చేరుకుని మంత్రి, ఎంపిలకు శాలవాలతో సత్కరించి రాఖీలు కట్టి పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో కొనసాగుతున్న అభివృద్ది పనులపై మం త్రి,ఎంపిలు ఆరా తీసినట్లు జడ్పీటిసి స్వప్న భాస్కర్ పేర్కొన్నారు.

### ప్రముఖులకు రాఖీలు కట్టిన కార్పోరేటర్ పుష్ప

**రామచంద్రాపురం, ఆగస్టు 31, ప్రభాతవార్త:** అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షా బంధన్ పర్వదినాన్ని పురష్కరించుకుని రామచంద్రాపురం డివిజన్ కార్పోరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ గురువారం బిఆర్ఎస్ ప్రముఖులకు రాఖీలు కట్టి పండగ శుభాకాంక్షలు తెలిపారు. హైద్రాబాద్‌లో రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరష్‌రావు, పటాన్‌చెరు నియోజకవర్గం భారతీ నగర్ డివిజన్‌లో మాజీ ఎమ్మెల్యే వి భూపాల్‌రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వి ఆదర్శ్‌రెడ్డిలకు రాఖీలు కట్టి నోటిని మిఠాయిలతో తీపి చేసి పండగ శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజకలు కార్పోరేటర్లు పుష్ప నగేష్, సింధూ ఆదర్శ్‌రెడ్డిలు పండగ శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రి హరీష్‌రావుకు రాఖీ కడుతున్న రామచంద్రాపురం కార్పోరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్



బాలసదనంలో కలెక్టర్‌కు రాఖీ కడుతున్న విద్యార్థులు



మంత్రి హరీష్‌రావుకు రాఖీ కడుతున్న జడ్పీటిసి సభ్యురాలు స్వప్న భాస్కర్



హైదరాబాద్‌లో మంత్రి హరీష్‌రావుకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలుపుతున్న బిఆర్ఎస్ మహిళ శ్రేణులు



మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డికి, రాష్ట్ర నాయకులు ఆదర్శ్‌రెడ్డిలకు రాఖీలు కడుతున్న కార్పోరేటర్ పుష్పనగేష్

## ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి సిఎం సానుకూలం

### మధ్యంతర భృతికి కృషి చేస్తున్నాం : ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి



ఎమ్మెల్సీ సమక్షంలో పిఆర్‌టియు జిల్లా నూతన ప్రధాన కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న ఇంద్రసేనారెడ్డి

**సిద్దిపేట రూరల్, అగస్టు 31, ప్రభాతవార్త :** 2023 జూలై 1తో మొదటి పిఆర్‌సి కాలం పూర్తి అయిందని సిఎం కెసిఅర్, మంత్రి హరీష్‌రావు దృష్టికి పిఅర్‌సి, ఇతర సమస్యలను తీసుకెళ్లామని అన్ని సమస్యలను పరిష్కరించడానికి సిఎం సానుకూలంగా ఉన్నారని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. పిఆర్‌టియు సిద్దిపేట జిల్లా శాఖ అత్యవసర సమావేశం జిల్లా కేంద్రంలోని పిఆర్‌టియు భవనంలో జిల్లా అధ్యక్షులు అదరాసు పల్లి శశిధర్ శర్మ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి పదవికి పంతం వెంకటరాజం రాజీనామా చేయడంతో ఏర్పడిన ఖాళీని అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కలిసి కొత్త జిల్లా ప్రధాన కార్యదర్శిగా మల్లుగారి ఇంద్రసేనారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల మధ్యంతర భృతితో పిఅర్‌సి కమిటీ వేసే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరించడానికి త్వరలోనే సిఎం ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయబోతున్నారని తెలిపారు. గత ఫిబ్రవరి నుంచి స్టేతో అగిపోయిన బదిలీలు, పదోన్నతులు కోర్టు కేసు పరిష్కరించడంతో వేలాది మంది ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూరబోతుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పిఅర్‌టియు ముందుకు సాగుతుందన్నారు. సమావేశంలో పిఅర్‌టియు నాయకులు పంతం వెంకటరాజం, లక్కిరెడ్డి విజయ, అస లక్ష్మణ్, రవీంద్రకుమార్, సురేందర్‌రెడ్డి, హనుమారెడ్డి, మల్లారెడ్డి, అనిల్‌కుమార్, వేమారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రామకృష్ణరెడ్డి, రాజశేఖర్, రామచంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సతీష్ కుమార్, బాపురెడ్డి, నరసింహ్మారెడ్డి, రాజురెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, పవన్‌కు మార్ తదితరులు పాల్గొన్నారు. కాగా జనగామ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్లు మహిపాల్‌రెడ్డి, నూకల ఎల్లారెడ్డిలు ఎన్నికల అధికారులుగా వ్యవహారించి ఇంద్రసేనారెడ్డితో జిల్లా నూతన ప్రధాన కార్యదర్శిగా ప్రమాణస్వీకారం చేయించారు.



ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

## ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**మనూర్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ధన్వార్, ఇస్లాంపూర్ గ్రామాల్లో గురువారం చేపట్టిన పలు అభివృద్ది కార్యక్రమాలకు నారాయణఖేడ్ శాసన సభ్యులు మాహారెడ్డి భూపాల్‌రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా 190 మంది లబ్దిదారులకు ఇండ్ల పట్టాలను ఎమ్మెల్యే పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాకే గ్రామాలు అభివృద్ది బాటలో పయనిస్తున్నాయని కొనియాడారు. ప్రతి రంగంలో అభివృద్ది పనులు నిర్వహించి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పాలన చేస్తోందని పేర్కొన్నారు. కాగ్రెస్ ప్రభుత్వాలు గతంలో అభివృద్దిని విస్మరించి పాలన చేశాయని ఆరోపించారు. నియోజకవర్గంలో రోడ్లు, విద్య, వైద్యం, విద్యుత్ తదితర రంగాల్లో అభివృద్ది చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి అధ్యక్షురాలు కొంగర జయశ్రీ మోహన్‌రెడ్డి,మండల బిఆర్ఎస్ అధ్యక్షులు విఠల్‌రావు, మండల కో-ఆప్షన్ సభ్యులు సలీం పటేల్, గ్రామాల సర్పంచ్‌లు తుల్జమ్మ, రవీందర్‌రావు, ఉప సర్పంచ్‌లు పాపయ్య, మండల పార్టీ ఉపాధ్యక్షులు కిషన్‌రావు, గ్రామ మైనార్టీ అధ్యక్షులు గులాం, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటించండి

**మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు31 ప్రభాతవార్త:** సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రణీద్ కుమార్, రాజగోపాల్‌గౌడ్‌లు అన్నారు. గురువారం మెదక్‌లోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. నూతన పెన్షన్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చిన సెప్టెంబర్ 1వ తేదీన నల్ల బ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేయాలని, అలాగే జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు పోచయ్య, శివప్రసాద్, సిద్ధిరాములు, రాజు, నరేష్, దుర్గరాములు, వేణుగోపాల్, దిలీప్‌కుమార్, మల్లేశం, గోపాల్, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రణీద్ కుమార్, రాజగోపాల్‌గౌడ్

# దళితుల మధ్య దళితబంధు చిచ్చు

**యూనిట్లు తక్కువ లబ్ధిదారులు ఎక్కువ**
**యూనిట్లను సమానంగా**
**పంచుకోవాలని ప్రజాప్రతినిధుల సలహా**
**చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న**
**అధికారులు**




గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయం

**గజ్వేల్, ఆగస్టు 31 (ప్రభాతవార్త):** ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు పథకం గజ్వేల్ మండలంతో పాటు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఉన్న దళితుల్లో చిచ్చు పెట్టేవిధంగా తయారైంది. మున్సిపల్ పరిధిలో 20 వార్డులు ఉండగా ఒక్కో వార్డులో పెద్దమొత్తంలో దళితులు ఉన్నారు. ఒక్కో వార్డులో మూడు లేదా నాలుగు యూనిట్లను మంజూరు చేయనున్నట్లు తెలిసింది. దీంతో ఆయా వార్డుల్లోని దళితులు అందరూ స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటుచేసుకొని తమకు అంటే తమకు యూనిట్లు మంజూరయ్యేలా చూడాలని కోరుతున్నారు. కొన్ని వార్డుల్లో దళితబంధు యూనిట్ వచ్చిన వారు రాని వారికి రూ.2 లక్షల చొప్పున ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకుంటుండగా మరికొన్ని వార్డుల్లో కౌన్సిలర్లు తమకు రూ.2 లక్షలు ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. అలాగే మరొక వార్డులో దేవాలయ నిర్మాణానికి రూ.2 లక్షలు ఇస్తేనే దళితబంధు మంజూరయ్యేలా చూస్తామని ఆ వార్డు ప్రజాప్రతినిధి పేర్కొంటున్నట్లు తెలిసింది. ఈ విషయంలో దళితబంధు వచ్చిన వారు మాట తప్పకుండా బాండ్ పేపర్లు సైతం రాసుకుంటున్నట్లు సమాచారం. ముఖ్యమం త్రి చంద్రశేఖర్‌రావు దళితులందరూ ఆర్థికంగా నిలదొక్కుకునేందుకే ఈ పథకాన్ని ప్రవేశపెడితే సిఎం నియోజకవర్గమైన గజ్వేల్ మండలంలో, మున్సిపల్ పరిధిలో దళితబంధు రూ.10 లక్షలు వస్తే అందరూ సమానంగా పంచుకోవాలని చెప్పడం ఏమిటి పలువురు ప్రశ్నిస్తున్నారు. దళితులు ఎక్కువగా ఉన్న చోట అందరికి మరోసారి వస్తాయని చెప్పి అర్హులైన నిరుపేదలకు దళితబంధు యూనిట్‌ను అప్పజెప్పే విధంగా అధికారులు చూడాల్సివుండగా వారు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉంది. మున్సిపల్ పాలకవర్గంలో ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు ఎంపిక చేస్తూ మిగతా వారిని చూసుకోవాలని బాహాటంగా చెప్పడం అందరిని విస్మయానికి గురిచేస్తుంది. గత నెల రోజుల నుండి ఏ వార్డులో చూసినా దళితులను సమావేశపరిచి యూనిట్లను ఎంపిక చేయాల్సింది పోయి వచ్చిన యూనిట్లను అందరూ సమానంగా పంచుకోవాలని సూచిస్తున్నట్లు ఒకరికొకరు చెప్పుకుంటున్నారు. దళితబంధు పథకం అంటే ఒకరికి రూ.10 లక్షల యూనిట్ కొనుగోలు చేసి ఇవ్వడం తప్ప నగదు రూపంలో ఇచ్చేది కాదు. అయినా నిరుపేదలకు ఇచ్చే యూనిట్‌ను వారు ఉపయోగించుకోవ డం తప్ప మరొకరికి నగదు రూపంలో ఇచ్చే అవకాశం లేదని ప్రజాప్రతినిధులకు, అధికారులకు తెలువదా? ప్రభుత్వ లక్ష్యం అది కాదు, నిరుపేదలను ధనవంతులను చేసేది దళితబం దు లక్ష్యమని పలువురు అంటున్నారు. అలాగే మున్సిపల్ పాలకవర్గ సభ్యులు బిసి బంధు, మైనార్టీ బంధులో సైతం తమ పెత్తనం కొనసాగిస్తూ తమకు నచ్చి న వారిని ఎంపిక చేస్తూ అర్హులకు అన్యాయం చేస్తూ అనర్హులకు పథకాలను అంటగడుతున్నారని, ఇదేమిటని ప్రశ్నిస్తే మీరు మాకు సంబంధించిన వారు కాదని, మీకు సంక్షేమ పథకాలు అందవని కరాఖండిగా చెప్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. సిఎం కెసిఆర్ గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీని పార్టీలకతీతంగా అన్ని రంగా లలో అభివృద్ధి చేశారని, ప్రజల్లో సిఎం కెసిఆర్‌కు చెడ్డ పేరు తెచ్చే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు వారి పాలన కొనసాగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చకుండా దళితబంధు యూనిట్లను పారదర్శకంగా ఎంపికచేయాలని కోరుతున్నారు.



సామూహికంగా గాయత్రి ధారణ కార్యక్రమాన్ని నిర్వహించిన పద్మశాలి సంఘం సభ్యుల దృశ్యం

## ఘనంగా సామూహిక జంధ్య ధారణ మహోత్సవం

**కౌడిపల్లి, ఆగస్టు 31, ప్రభాతవార్త:** రాఖీ పౌర్ణమి, జంజీరాల పౌర్ణమి పర్వదినంను పురష్కరించుకొని గురువారం నాడు మండల కేంద్రమైన కౌడిపల్లిలోని శ్రీ అభయ రామాలయంలో మండల చేనేత పద్మశాలి సంఘం అధ్యక్షులు పిస్కె నర్సింలు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన ఆర్చకులు ఫణింద్ర శర్మ వేద మం త్రాల నడుమ మండల వ్యాప్తపంగా ఉన్న పద్మశాలీలు గాయత్రి (జంజం) ధారణ చేశారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం అధ్యక్షులు పిస్కె నర్సింలు విలేకర్లతో మాట్లాడుతు మానవ సమాజానికి వస్త్రాన్ని అందించిన నైపుణ్యత కల్గిన వారు పద్మశాలీలు అన్నారు. ఏన్నడు లేని విధంగా ఈ యేడు మండల పద్మశాలీలు జిల్లా సంఘం అధ్యక్షులు జయరాములు, ప్రధాన కార్యదర్శి శివశంకర్‌ల సూచన మేరకు సామూహికంగా జంజీరం (గాయత్రిని)ధారణ మహోత్స వంను ఘనంగా జరుపుకోవడం జరిగిందని ఆయన అన్నారు. శ్రీ అభయ రామాలయంలో పద్మశాలీలు ఏకం కావడం చాలా ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. ఇదే ఐక్యతతో ఉంటే పద్మశాలి హక్కులను సాధించుకోవడం సులభతరం అయ్యితుందని ఆయన హితువు పల్కినారు. చేనేత బంద్ పథకం ద్వారా ప్రతి పద్మశాలి కుటుంబాన్నికి రూ. 10 లక్షలతో పాటు కంప్యూటరైజ్డ్ లూమింగ్, వస్త్రాలను నేసే యంత్రాలను రాయితీపై ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈయన తోపాటు విశ్రాంతి ఫార్మసిస్టు డాక్టర్ పురుషోత్తం, పద్మశాలి సంఘం జిల్లా యూత్ ఉపాధ్యక్షులు సంబారపు తిరుమల్లేశ్, మంత్రి క్రిష్ణ, పద్మ దుర్గయ్య, పోల జనార్ధన్, పోల ప్రభాకర్, పోల పురుషోత్త ం,మంత్రి ఆంజనేయులు, డాక్టర్ శ్రీనివాస్, బోద్దు పెంటయ్య, పి. శ్రీనివాస్, ఎస్ శ్రీనివాస్, నవీన్, పోల లక్ష్మన్, భీమేష్, రంగేష్, శ్యాం కుమార్, వీరేశ్,నరేందర్, నర్సింలు,శంకరయ్య, కిష్టయ్య పాల్గొన్నారు.

## సీపీఎస్ రద్దు చేయాల్సిందే

**చిన్నశంకరంపేట,ఆగస్టు 31,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి పోచయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. పీఆర్సీ కమిటీని వేయాలని, బదలీల షెడ్యూలును విడుదల చేయాలని, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని జీవో 342ను సవరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సెప్టెంబర్ 1వ తేది పెన్షన్ విద్రోహ దినంగా పాటీస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జిలను ధిరించి నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యక్షుడు శివప్రసాద్, గోపాల్, సత్యనారాయణ,జహీర్, అక్బర్,రామలింగం, విద్యాసాగర్‌లున్నారు.

## బదిలీలను వేగవంతం చేయాలి

**చిన్నశంకరంపేట,ఆగస్టు 31,ప్రభాతవార్త:** కోర్టు ఉత్తర్వుల జారీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ప్రక్రియన వేగవంతం చేయాలని టీపీటీఎఫ్ మం డల అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌లు డిమాండ్ చేశారు. గురువారం వారు చిన్నశంకరంపేటలో మాట్లాడుతూ బదలీలు,పదోన్నతులకు కటాఫ్ తేదిగా 1.09.23గా నిర్ణయించాలని, పండిట్, పిఈటి అప్‌గ్రెడెషన్ కేసులో కూడ కోర్టు తీర్పు రిజర్వులో ఉన్నందున వాటిపైన కూడ దృష్టి సారించి వెంటనే పండిత్, పిఈట్ అప్‌గ్రెడెషన్ పూర్తి చేయాలన్నారు. జీవో 317 జీవో ప్రభుత్వ ఉపా ధ్యాయులకు వెంటనే న్యాయం చేయాలని అర్హులైన వారికి పదోన్నతులను కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

## అమ్మవారికి వెండి మకరతోరణం బహూకరణ



అమ్మవారికి నూతన వెండి మకర తోరణం అందిస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, అగస్టు 31, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషిమాత దేవాలయంలో అమ్మవారి పుట్టిన రోజు రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు రక్షాబంధన్ చేశారు. అమ్మవారికి స్వర్గీయ బొమ్మెర సత్యనారాయణ జ్ఞాపకార్థం అతని కుటుంబీకులు సరోజన, సంతోష్‌కుమార్, దివ్య, ప్రవీణ్‌కుమార్ రూప, శివకుమార్ లక్ష్మీ ప్రియ, మణెమ్మ 1 కిలో 960 గ్రాముల వెండి మకరతోరణాన్ని అలయ పాలకమండలి సభ్యులకు అమ్మవారి పుట్టిన రోజు సందర్భంగా అందజేశారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా అలయంలో అభిషేకం, అష్టోతర్తముతో పుష్పార్చన నిర్వహించారు. కార్యక్రమంలో అలయ పాలక మండలి ఛైర్మన్ మాంకాల నవీన్‌కుమార్, మాజీ ఛైర్మన్లు కాచం కాశీనాథ్, తమ్మిశెట్టి వీరేశం, ధర్మకర్తలు గాదగోని సత్యంగౌడ్, కాముని ప్రభాకర్, చకిలం అమర్‌నాథ్, కల్యాణి,సువర్ణ, అక్సిఫిషియా సభ్యులు మధుసూధన్‌రావు, అలయ అర్చకులు రామకృష్ణ, మాజీ ధర్మకర్తలు సంతోష్‌కుమార్, మాధురి, రాము, సిబ్బంది శంకర్, వాసు, సహ అర్చకులు సాయికృష్ణ, పాండే, స్వచ్ఛంద సేవకులు శివ, శేఖర్, వాణి, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రంగస్థల ప్రముఖుడు శ్రీనివాస్‌కు తెలుగు విశ్వవిద్యాలయ కీర్తి పురస్కారం

**రవీంద్రభారతి, ఆగస్టు 31 ప్రభాతవార్త :** గత 35 సంవత్సరాలుగా భారతీయ నాటకరంగంలో నాటక పరిషత్‌లు, బహుభాషా నాటకోత్సవాలతో కలిపి 68 నాటకోత్సవాల నిర్వాహకుడుగా 460కిపైగా ప్రదర్శనలతో విశేష సేవలందిస్తూ సెటక ప్రస్తానంలో జాతీయస్థాయి గుర్తింపును తెచ్చుకున్న అభినయ శ్రీనివాస్‌కు తెలుగు నాటకరంగంలో విశిష్ట సేవలందించిన వారికి ఇచ్చే ప్రతిష్టాత్మక పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ కీర్తి పురస్కారాన్ని విశ్వవిద్యాలయం ప్రకటించింది. 1969లో నటుడిగా మొదలైన నాటకరంగ ప్రయాణంలో అనేక నాటికల్లో నటించడం, దర్శకత్వం వహించడం తోపాటు తెలుగు నాటకానికి దిక్సూచిలాంటి అభినయ మాసపత్రికను 2004లో ప్రారంభించి, ప్రచురితమైన నాటక సమీక్షలు తెలుగు నాటక రంగానికి మార్గనిర్దేశాన్ని కలిగించారు. బహుభాషా నాటకోత్సవాల ద్వారా అనేక తెలుగు నాటకాలు రూపొందించడం, ఈ ఉత్సవాల నిర్వహణలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖలతోపాటు దేశంలోనున్న 21 ప్రభుత్వ సాంకేతిక సంస్థలతో కలిసి పనిచేయడం అతని నిర్వహణ స్థాయికి నిదర్శనం. అంతేకాక భారత ప్రభుత్వ సంస్థ సౌత్ జోన్ కల్చరల్ సెంటర్, తంజావూరు వారు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో నిర్వహించిన 19 జాతీయ జానపద ఉత్సవాల నిర్వహణ బాధ్యతను అభినయ శ్రీనివాస్ విశేషం.

### కోట్లు దాటిన డిపాజిట్లు

భారతదేశంలో అగ్రశ్రేణి వైవిధ్యభరితమైన నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల్లో ఒకటైన బజాజ్ ఫిన్‌సర్వ్ భాగమైన బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ తమ పిక్సిడ్ డిపాజిట్ల ఖాతా రూ.50,000 కోట్ల మైలురాయిని దాటినట్లు ప్రకటించింది. బజాజ్ ఫైనాన్స్‌కుఅయిదు లక్షలమందికిపైగా వినియోగదారులు ఉన్నారు.



హుస్నాబాద్ శాసనసభ్యులు సతీష్‌కుమార్‌కు రాఖీ కడుతున్న మున్సిపల్‌ఛైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న



నివాసంలో ప్రతాప్‌రెడ్డికి రాఖీ కడుతున్న మహిళలు



అన్నకు రాఖీ కడుతున్న చెల్లెలు

# ఆత్మీయబంధానికి ప్రతీక రక్షాబంధన్

**హుస్నాబాద్, ఆగస్టు31, ప్రభాతవార్త**

నువ్‌నాకు రక్ష నేను నీకు రక్ష మనం దేశానికి రక్ష అంటూ రాఖీ వేడుకలను గురువారం హుస్నాబాద్ పట్టణంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్నతో పాటు కౌన్సిలర్లు పాల్గొని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు వొడితెల సతీష్‌కుమార్ అందరికి రాఖీ పర్వదిన శుభాకాంక్షలను తెలియచేసారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ అయిలేని అనితశ్రీనివాసరెడ్డి, మార్కెట్‌ఛైర్మన్ ఎడబోయిన రజినీతిరుపతిరెడ్డి, కౌన్సిలర్లు కొంకటి నళినీదేవిరవిందర్, వాలా సుప్రజనవీన్‌రావు, బోజు రమాదే విర విందర్, జనగామ రత్నమాలరవీందర్‌రావు, కోఆప్షన్‌సభ్యులు అయిలేని శంకర్‌రెడ్డి, మహ్మద్ అయూబ్‌పాషా తదితరులు ఉన్నారు.

### రాఖీ వేడుకల్లో పాల్గొన్న పొన్నం

హుస్నాబాద్ పట్టణ మున్సిపల్‌ఫ్లోర్‌లీడర్ చిత్తరి పద్మరవిందర్ గృహంలో నిర్వహించినరాఖీపౌర్ణమి వేడుకలకు కరీంనగ్ మాజీ పార్లమెంట్‌సభ్యులు, బిసి డిక్లరేషన్‌కమిటీఛైర్మన్ పొన్నం ప్రభాకర్‌గౌడ్ హాజరై రాఖీ కట్టంచుకున్నారు. ఈ సందర్భంగా చిత్తారి పద్మ రాఖీ కట్టి రాబోవు ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించి అధ్భుతంగా రాణిస్తారని ఆశించారు.

### అన్నాచెల్లెళ్ళ అనుబంధానికి ప్రతీక రాఖీ పౌర్ణమి

**గజ్వేల్, ఆగస్టు 31 (ప్రభాతవార్త):** కులమతాలకతీతంగా ప్రేమతో, ఆప్యాయతతో రాఖీ కట్టడం ఎంతో సంతోషంగా ఉందని ఎఫ్‌డిసి ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం గజ్వేల్ పట్టణంలోని సిఎం మినీ క్యాంపు కార్యాలయంలో రాఖీ పండుగ సందర్భంగా స్థానిక మహిళా కౌన్సిలర్లు బబ్బూరి రజితగౌడ్, శీర్ల శ్యామలమల్లేశం, మర్కంటి వరలక్ష్మికనకయ్య, బిఆర్‌ఎస్ నాయకులు రజియాలు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గ ప్రజలకు, మహిళలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గంగ, జమున, తహజీబ్ సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ అన్నాచెల్లెళ్ళ బంధంతో రాఖీ కట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. వెలకట్టలేని బంధాలను, వదులుకోలేని అనుబంధాలను గుర్తుచేసేదే రక్షాబంధన్ అన్నారు. అన్నాచెల్లెలు అనుబంధానికి ప్రతీక రాఖీ పౌర్ణమి అని, తల్లిదండ్రుల తర్వాత అంతటి ప్రాధాన్యత కలిగి ఉన్న అనుబంధం తోబుట్టువుల మధ్య ఉంటుందన్నారు. సిఎం కెసిఆర్ రాష్ట్రంలోని ఆడబిడ్డలు అందరికీ పెద్దపీట వేశారని, మహిళల సంక్షేమం కోసం షీటీమ్స్ సఖి కేంద్రాలను ఏర్పాటుచేసిన ఘనత సిఎం కెసిఆర్‌దే అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మహిళలకు కళ్యాణలక్ష్మి, షాదిముబారక్, కెసిఆర్ కిట్, అమ్మ వడి, న్యూట్రిషన్ కిట్స్, షీటీమ్స్, ఒంటరి మహిళలకు పెన్షన్లు, వృద్ధాప్య పెన్షన్లు లాంటి ఎన్నో రకాల సంక్షేమ ఫలాలను నేరుగా అందిస్తున్నారన్నారు. అనంతరం గజ్వేల్-ప్రజ్ఞాపూ ర్ మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు కౌన్సిలర్ గుంటుకు శిరీషరాజు ఆధ్వర్యంలో వారి స్వగృహంలో రాఖీ పండుగ సందర్భంగా ఎఫ్‌డిసి ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రె డ్డికి కులమతాలకతీతంగా హిందూ, ముస్లీం, మార్వాడీ సోదరీమణులు ఆప్యాయతతో రాఖీ కట్టారు. ఈ కార్యక్ర మంలో పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, యూత్ అధ్య క్షుడు మల్లేశం, బిఆర్‌ఎస్ నాయకులు మర్కంటి కనకయ్య, అహ్మద్, బాబులాల్ తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో రాఖీ పౌర్ణమి శోభాయాత్ర నిర్వహిస్తున్న పద్మశాలి సమాజం

### చిన్నశంకరంపేటలో..

**చిన్నశంకరంపేట, ఆగస్టు 31, ప్రభాతవార్త:** అన్నా చెల్లెళ్ల, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ. అన్నా చెల్లెళ్ల అనురాగ బంధానికి అంతులేని గౌరవం కల్పించే పండుగే రాఖీ పండుగ. అన్నా చెల్లెళ్ల ఆత్మీయత అనురాగాలు వారి వివాహాల అనంతరం కూడ కొనసాగేందుకు ఈ పండుగ తోడ్పడుతుంది. అన్నయ్య, తమ్ముడు క్షేమంగా ఉండాలని అమ్మలా లాలించి, నాన్నల ఆదరించాలని ఆకాంక్షిస్తూ సోదరి తన అన్నదమ్ములకు రక్ష కట్టి నా రక్షణ బాధ్యత నీదే అంటూ గుర్తు చేస్తారు. జీవితాంతం రక్షణగా నిలుస్తానని మాట ఇస్తూ సోదరుడు తన తోబుట్టువుకు శుభాకాంక్షలు అశీస్సులతో పాటు కానుకలు ఇచ్చి సంతోష పెట్టడం సంప్రదాయంగా వస్తుంది. మండల అన్ని గ్రామాలలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్నా,తమ్ముళ్లకు సోదరీమణులు రాఖీలు కడుతూ ఆశీర్వాదం తీసుకుంటూ.... ఘనంగా రాఖీ పండుగను నిర్వహించారు.

### రామాయంపేటలో..

**రామాయంపేట, ఆగస్టు 31, ప్రభాతవార్త:** అన్నా,చెల్లెళ్ల అక్కా,తమ్ముళ్ల ప్రేమాను బంధాలకు ప్రతికగా నిలిచే రక్షా బంధన్ పండుగ (రాఖీ పౌర్ణమి) వేడుకలు రామాయంపేట మండలంలో గురువారం నాడు ఘనంగా జరిగాయి. రాఖీ పండుగ నాడు జంధ్యాలు మార్చుకోవడం... అనవాయితీగా వస్తుంది. అయితే ఉదయం 8 గంటలలోపే గాయత్రి జపం చేస్తూ భక్తి శ్రద్దలతో జంధ్యాలను మార్చుకున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా తమ అన్నలకు, తమ్ముళ్లకు, అక్క చెల్లెళ్లు రాఖీలను కట్టారు. సోదరులు ఎంత దూరంలో ఉన్నా వారికి రాఖీలను కట్టి తమ ప్రేమ అప్యాయతలను పంచుకున్నారు. ఈ సారి రామాయంపేట పట్టణంలో చాలా రాఖీల దుకాణాలు వెలిసాయి. ఉదయమే లేచి స్నాన సంధ్యాదులు ఆచరించి దేవాలయాలకు వెళ్లి భగవంతున్ని దర్శించుకున్నారు. పట్టణంలోని వార్డుల్లో వివిధ రకాల కార్యక్రమాలు సాగాయి. అలాగే మండల పరిధిలోని అన్ని గ్రామాలలో రక్షాబందన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలో విద్యార్థులు రక్షా బంధన్ వేడుకలను జరుపుకున్నారు.

### కాట్రియాల గ్రామంలో...

రామాయంపేట మండలంలోని కాట్రియాల గ్రామంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా స్థానిక గ్రామ ఉప సర్పంచి స్రవంతి రాజేందర్ వినూత్న రీతిలో రాఖీ పౌర్ణమి వేడుకలు గ్రామానికి చెందిన యువకులకు రాఖీ కడుతూ వారికి హెల్మెట్లను పంపిణీ చేయడంతో పాటు ప్రయాణం చేసేటప్పుడు హెల్మెట్ ధరించాలని వారికి సూచించారు.

### అక్కన్నపేటలో..

**అక్కన్నపేట. ఆగస్టు31, ప్రభాతవార్త**

అన్నా చెల్లెల పవిత్రబంధానికి తోడునీడగా నిలిచే ఆత్మీయ సోదరుడైన తమవాడు కళ్ళముందు లేకున్నప్పటికీ నీకు తోడుగా మేమున్నామంటూ ఆ చెల్లమ్మలు ప్రతీ ఏటా తన అన్న సైన్యంలో చేరి అసువులు బాసినా ఇంకా అతని సమాధికి చేరకుని విగ్రహప్రతిష్ట చేసిన అతనికి రాఖీలు కట్టి తమతో లేకున్నా వీరమరణం పొందిన జవాన్ నరసింహ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉండాలని ఆశిస్తున్నారు, నరసింహ తల్లితండ్రులు గుగులోతు లింగయ్య తల్లి సత్తవ్వలు కూడా వారి కూతు ళ్ళతో కలిసి సమాధి వద్దకు చేరుకుంటారు. సోదరీమణులు రాజమ్మ, బులమ్మ, శ్రీలతలు వచ్చి నరసింహకు రాఖీ కట్టి ఆశీర్వాదాలు తీసుకుని వెళతారు.

### ఘనంగా రాఖీ పౌర్ణమి శోభాయాత్ర

**సిద్దిపేట రూరల్, అగస్టు 31, ప్రభాతవార్త :** నూలు(జంద్యాల) పౌర్ణమి పురస్కరించుకొని పట్టణ పద్మశాలి సమాజం, యువజన విభాగం అధ్వర్యంలో రాఖీ పౌర్ణమి శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని మార్కండేయ దేవాలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర పట్టణ పురవీధుల గుండా చేనేత యాత్ర కొనసాగింది. శోభాయాత్రను కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలి సమాజం అధ్యక్షులు కాముని రాజేశం, ప్రధాన కార్యదర్శి చేర్యాల మల్లికార్జున్, కోశాధికారి ముదిగొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఇప్పకాయల శ్రీహరి, పెద్ది అశోక్, సహాయ కార్యదర్శి గుండు రవితేజ, కమిటీ సభ్యులు సిరిగాది బాలర్‌రాజు, ప్రసాద్, బత్తిని రాజ్కోటి, పెద్ది శ్రీనివాస్, రాపల్లి శ్రీనివాస్, చిట్టిమల్ల భాస్కర్, బూర మధుసూదన్, గణేష్, యాదగిరి, సురేష్, అంజనేయులు, కన్నయ్య పాల్గొన్నారు.

### జగదేవ్‌పూర్‌లో..

**జగదేవ్‌పూర్, ఆగస్టు 31 (ప్రభాతవార్త):** అన్నాచెల్లెళ్ళు, అక్కా తమ్ముళ్ళ అనురాగానికి ప్రతీక అయిన రక్షాబంధన్ వేడుకలను జగదేవ్‌పూర్ మండలకేంద్రంతో పాటు చాట్లపల్లి, వట్టిపల్లి, మునిగడపతో పాటు అన్ని గ్రామాల్లో గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయాన్నే ఆడపడుచులు తమ సోదరులకు రాఖీలు కట్టాలనే ఉత్సాహంతో గ్రామాల్లో నెలకొల్పిన రాఖీ సెంటర్ల వద్దకు వెళ్ళి రకరకాల రాఖీలను, మిఠాయిలు కొనుగోలు చేయడం కనిపించింది. పట్టణాలలో నివసించే ఆడపడుచులు తమ సోదరులకు రాఖీ కట్టాలని పల్లెలకు చేరుకొని తమ సోదరులకు రక్షాబంధన్ కట్టి ఆనందంగా గడిపారు.



చిన్నశంకరంపేటలో అన్నకు రాఖీ కడుతున్న చెల్లెలు



రాజుతండాలో స్వర్గీయ సైనికునికి జోహార్ నర్సింహ అంటూ రాఖీ కట్టిన తోబుట్టువులు



చాట్లపల్లిలో తమ్మునికి రాఖీ కడుతున్న అక్క

# సిద్దిపేటలో ఘనంగా రక్షాబంధన్

**సిద్దిపేట ప్రభాతవార్త, మిర్‌దొడ్డి/కొమురవెల్లి/నంగునూరు, ఆగస్టు 31, ప్రభాతవార్త:**

### కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

కుల మతాలకు ప్రతీకగా రక్షాబంధన్ నిలుస్తుందని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. సిద్దిపేట పట్టణంలోని బాలసదనంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో రాఖీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గయాజుద్దీన్, రషద్, బైరి సాయి, సలీం, ఫయాజ్, నవాజ్, మధు పాల్గొన్నారు.

### మిర్‌దొడ్డిలో....

పవిత్ర శ్రావణ మాసం రోజైన గురువారం మిర్‌దొడ్డి మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో రక్షాబంధన్ పండగా ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని దేవాలయాలను సుందరంగా అలంకరించి మహిళలు మంగళ హారుతులతో ప్రత్యేక పూజాలు నిర్వహించారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు తమ తమ సోదరులకు రాఖీలు కట్టి స్వీట్లు పంచుకున్నారు. రాఖీలు వెలియడంతో వాటిని కొనుగోలు చేయడానికి మహిళలతో దుకాణాలు కిటకిటలాడాయి. శ్రావణ మాసం పండుగ వాతావరణ ంతో గ్రామాలు నూతన శోభను సంతరించుకున్నాయి.

### చిన్నకోడూరులో..

చిన్నకోడూరు మండలంలో ఘనంగా రక్షా బందన్ వేడుకలు నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామా ల్లో సోదరిలు సోదరులకు రాఖీలు కట్టి కట్న కానుకలు అందుకున్నారు. రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని మండలంలోని వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### కోహేడలో....

కోహేడ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గురువారం రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని సోదరిలు, సోదరులకు రాఖీలు కట్టి అన్నా, చెల్లల అనుబంధాన్ని పంచుకున్నారు. ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో మహిళలు ప్రత్యేక పూజాలు నిర్వహించారు.

### కొమురవెల్లిలో..

మండల పరిధిలోని అయా గ్రామాల్లో గురువారం రాఖీ పౌర్ణమి సందర్భంగా రక్షాబంధన్ కార్యక్రమాన్ని విజయవంతంగా జరుపుకున్నారు. అక్కాచెల్లెళ్లు అన్నదమ్ములకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి తయ అప్యాయతను అనురాగాన్ని చాటుకున్నారు. శ్రీ మల్లికార్జున స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### బెజ్జంకిలో..

రాఖీ పౌర్ణమి సందర్భంగా మండల కేంద్రంతో పాటు అయా గ్రామాల్లో రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అక్కా చెల్లెళ్లు వారి సోదరులకు రాఖీలు కట్టి తమ అనురాగాన్ని చాటగా సోదరులు వారికి కానుకనుల ఇచ్చారు. సోదరీమణుల అనురాగానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగలో తమ అనురాగాలు, అప్యాయతలను చాటుకున్నారు. అన్నాదమ్ములకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించిగా వారికి కానుకలను అందించి అశీర్వదాలను అందుకున్నారు.

### నంగునూరు మండలంలో...

నంగునూరు మండలంలోని వివిధ గ్రామాల్లో రాఖీ పూర్ణిమ వేడుకలు గరువారం ఘనంగా నిర్వహించారు. శ్రావణ పూర్ణిమ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. తోబుట్టువుల అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండగ సందర్భంగా మహిళలు కొత్త బట్టలు కట్టుకుని తోబుట్టువులకు రాఖీలతో రక్షాబంధన్ చేశారు. మిఠాయిలను పంపిణీ చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉత్సవాలను సాంప్రదాయబద్దంగా సంబరంగా జరుపుకున్నారు.



బాలసదనంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అత్తుకు రాఖీ కడుతున్న దృశ్యం



సూర్యాపేటకు వెళుతున్న నాయకులు అరెస్టు చేసిన పోలీసులు

## బిఎస్‌పి నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

**జహీరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు జంగయ్య యాదవ్‌కు మద్దతుగా సూర్యాపేటలో నిర్వహించే కార్యక్రమానికి బిఎస్‌పి అసెంబ్లి ఇంచార్జి సిద్దూ రావణ్ ఆధ్వర్యంలో బయలు దేరిన బిఎస్‌పి నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీసు ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా సిద్దూరావణ్ మాట్లాడుతూ తమ పోరాటం ఆరెస్టులను అడ్డుకోలేరని ప్రభుత్వానికి హెచ్చరించారు. త్వరలో రానున్నది బ్యాలెట్ యుద్ధమని ప్రజలు ఆ యుద్దంలో ప్రభుత్వానికి తగు రీతిలో గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బిఎస్‌పి అసెంబ్లి ఇంచార్జి సతీష్, శ్రీనివాస్, మోజెస్, యాదగిరి, ప్రదీప్ తదితరులు అరెస్టు అయిన వారిలో ఉన్నారు.

### బిఎస్‌పి ఇంచార్జి ముందస్తు అరెస్టు



బిఎస్‌పి ఇంచార్జిని ముందస్తుగా అరెస్టు చేసిన పోలీసులు

**కంగ్టి, ఆగస్టు 31, ప్రభాతవార్త:** సూర్యాపేటలో జరిగిన సంఘటనకు బయలు దేరిన నారాయణఖేడ్ బిఎస్‌పి ఇంచార్జి బోర్గి భీమన్నను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. బిఎస్‌పి ఇంచార్జితో పాటు నాయ కులు రవీందర్‌సింగ్, వాలునాయక్ వగ్గే రాజు ఓంకార్‌లను ఎఎస్‌ఐ నారాయణ ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసకుని పోలీసు ఠాణాకు తరలించారు.

## ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు



సామూహిక సత్యనారాయస్వామి వ్రతాలు జరుపుకుంటున్న దంపతులు

**చౌటకూరు, ఆగస్టు 31, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సరాప్‌పల్లి గ్రామంలో శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం వారి సహకారంతో గురువారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తి శ్రద్దలతో వైభవంగా ఆచరించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి వారి ఆలయంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో గ్రామానికి చెందిన 11 మంది దంపతులచే వ్రతాన్ని నిర్వహించారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రాతాన్ని గ్రామస్థులు పెద్ద సంఖ్యలో చేరుకుని వ్రతాన్ని కనులార వీక్షించి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీనియర్ అసిస్టెంట్‌కు ఘనంగా వీడ్కోలు

**ఝరాసంగం, ఆగస్టు 31, ప్రభాతవార్త:** జహీరాబాద్ నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన ఎండి వాహిదుద్దీన్‌కు గురువారం ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎంపిపి అధ్యక్షులు ప్రియాంక గుండారెడ్డి, ఎంపిపి ఉపాధ్య క్షులు మక్సూద్, ఎంపిడిఓ మహేష్, ఎంపిటిసి సభ్యులు, పంచాయితీ కార్యదర్శులు, ఉపాది హామి సిబ్బంది పాల్గొన్నారు.

## ధర్మానాయక్‌కు మాజీ డిప్యూటీ సిఎం ఆర్థిక సహాయం

**పుల్కల్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** మండల పరిధిలోని లక్ష్మీసాగర్ హనుమాన్ తండాకు చెందిన ధర్మనాయక్ ఆనారోగ్యంతో ఆసుపత్రి పాలై చికిత్స అందుకుంటున్నాడు. ధర్మనాయక్ ఆనారోగ్యంతో అవస్థలు పడుతున్నట్లు తెలుసుకున్న ఉమ్మడి రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహా తన అనుచరులతో ధర్మనాయక్‌కు 5వేల రూపాయల ఆర్థిక సహాయం అందించేలా చేశారు. కార్యక్రమంలో నాయకులు హరినాయక్ రాథోడ్, సంగారెడ్డి, దుర్గేందర్ నాయక్ ఉన్నారు.

## షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలి



బిక్షాటన చేస్తున్న సెకండ్ ఎఎన్‌ఎంలు

**సంగారెడ్డి మున్సిపాలిటి ఆగస్టు 31 ,ప్రభాతవారత్త:**
తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సెకండ్ ఎఎన్‌ఎంలు చేపట్టిన నిరవదిక సమ్మె గురువారం 16వ రోజుకు చేరుకుంది. ఈరోజు సమ్మెలో పాల్గోన్న ఎఎన్‌ఎంలు బిక్షాటన చేశారు. రెగ్యూలరరైజ్ చేయాలని తాము కోరుతుంటే, ప్రభుత్వం తమకు షోకాజ్ నోటీసులు ఇచ్చి మనస్థాపానికి గురి అయ్యేలా చేస్తోందని అన్నారు. ఇచ్చిన నోటీసులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి బోయిని ప్రసాద్ ప్రభుత్వంను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్యామల, లలిత, రాములమ్మ, కమల తదితరులు పాల్గోన్నారు.

## సూర్యపేటకు వెళుతున్న నాయకుల అరెస్టు

**న్యాల్‌కల్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** బిఎస్‌పి రాష్ట్ర ఆధిష్టానం పిలుపు మేరకు సూర్యపేటకు వెళుతున్న నాయకులను గురువారం హద్నూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని మిర్జాపూర్(ఎన్) గ్రామానికి చెందిన బేగరి రాహుల్, మండలంలోని టేకూర్ గ్రామానికి చెందిన పుండికూర సంగ్రామ్, సంగపోళ్ళ శ్రీకాంత్, పుండికూర బస్వరాజ్, మొగులిపువ్వ డేవిడ్, మేతరి చంద్రయ్య, బేగరి శ్రీనివాస్, మొగులిపువ్వ సందీప్‌కుమార్‌లు సూర్యవపేటకు వెళుతున్న క్రమంలో మండలంలోని గంగ్వార్ చౌరస్తాలో అదుపులోకి తీసుకుని హద్నూర్ ఠాణాకు తరలించారు. సాయంత్రం స్వంత పూచీకత్తుపై పోలీసులు విడుదల చేశారు.

### ఫోటోగ్రఫీ అవార్డులు

ప్రముఖ గ్లోబల్ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ వివో ఇమాజిన్ స్మార్ట్‌ఫోన్ ఫ్రోటో గ్రఫీ అవార్డ్స్‌ను విడుదల చేసింది. స్మార్ట్‌ఫోన్ ఫోటోగ్రఫీ కళను సెలబ్రెట్ చేసుకోవడానికి ఎలివేట్ చేయడానికి ఈ అద్భుతమైన ఫ్రోటోగ్రఫీ ఫోటీ రూపొందించబడింది. ఆపరేషన్ ఎక్స్‌పర్ట్ వార్నర్ బ్రదర్స్ డిస్కవరీతో బాగస్వామ్యం కుదుర్చుకుని ఫ్రోటోగ్రఫీ ఔత్సాహికులు తమ సృజనాత్మకత దృక్పథాన్ని వారి పరికరాల లెన్స్ ద్వారా ప్రదర్శించడానికి ఒక ప్రత్యేక వేదికను అందించడం ఈ అవార్డుల లక్ష్యం.



రాష్ట్ర మంత్రి హరీష్‌రావుకు రాఖీ కడుతున్న జడ్పీటిసి పైతర మీనాకి



బిజెపి నాయకుడికి రాఖీ కడుతున్న తోబుట్టువు



హద్నూర్‌లో సోదరులకు రాఖీలు కడుతున్న సోదరీమణులు



కౌడిపల్లిలో సోదరుడికి రాఖీ కడుతున్న సోదరి

# ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

**మునిపల్లి, ఆగస్టు 31, ప్రభాతవార్త:** రక్షా బంధన్ పర్వదినాన్ని పురస్కరిం చుకుని గురువారం మండల జడ్పీటిసి సభ్యురాలు పైతర మీనాక్షిసాయికుమార్ బిఆర్ఎస్ ప్రముఖులకు రాఖీలు కట్టి పండగ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, జహీరాబాద్ ఎంపి బిబి పాటిల్, అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చంటి రాహుల్ కిరణ్, చంటి హృదయ కిరణ్‌లకు హైద్రాబాద్ లోని వారి వారి నివాస గృహాల్లో శాలువాలతో సత్కరించి రాఖీలు కట్టి పండగ శుభాకాంక్షలు తెలిపారు.

### కౌడిపల్లిలో..

**కౌడిపల్లి, ఆగస్టు 31, ప్రభాతవార్త:** అన్నా-చెల్లెల్లు, అక్క-తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా నిల్చిన రక్షా బంధన్ వేడుకలను రాఖీ పౌర్ణమి శుభదినాని పురస్కరించుకోని గురు వారం నాడు కౌడిపల్లి మండల వా ్యప్తంగా సోదరిమణులు తమ సోదరులకు రాఖీలను కట్టిన రాఖీ పౌర్ణమి మహోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుండి సోదరిమణులు నూతన వస్త్రాలను ధరించి, తమ అన్న, తమ్ములకు రాఖీలను కట్టడానికి తనతో పాటు ఏడుఅడుగుల వేసిన భర్తతో పాటు పుట్టింటికి వచ్చి రాఖీలు కట్ట ఆనందోత్సవంగా పండుగను జరుపుకున్నా రు. తొడబుట్టిన సోదరిమణులకు బోట్టు పసుపు, చీరే సారేలు ఇవ్వగా, తన పుట్టి నింటిని చల్లా చూడాలని ఆ భగవంతునుతో ప్రారిస్థు సోదరులను ఆశీర్వాదించారు. భారత దేశ వ్యాప్తంగా ఈ రాఖీ పండుగను అంగరంగ వైభవంగా జరుపుకోవడం ప్రతి యేట జరుగుతుంది. సోదరిమణులు రాఖీలకు ఎంత ధర అయ్యిన వెచ్చించి రాఖీలను క్రయం చేసి సోదురులకు రాఖీలను కట్టి పండుగను సోదర సోదరిమణులు ఘనంగా జరుపుకోవడం జరిగింది. కాగా కౌడిపల్లి గ్రామంలో కౌడిపల్లి-చిలిపిచెడ్-కోల్చారం ఏరియా కెమిస్ట్ అండ్ డ్రగీస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు మనోహర్ గౌడు ముద్దుల కూతురు తన సోదరులకు తమ ఇంట్లో రాఖీ కట్టి, స్వీట్లు పెట్టి, మంగళ హారితిలు ఇచ్చి ఘనంగా రాఖీ పండుగను జరుపుకోవడం జరిగింది. మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు చిలుముల వెంకటేశ్వర్లురెడ్డి, కౌడిపల్లి ఎంపిటీసీ కాలేరు శివాంజనేయులు, పలు వ్యాపారస్థులు, పేద, ధనిక తేడా కుండా రాఖీ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

### పుల్కల్‌లో..

**పుల్కల్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** రక్షా బంధన కార్యక్రమాన్ని గురువారం ఉమ్మడి పుల్కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సోదరీమణులు తమ సోదరులకు రాఖీలకు కట్టి మిఠాయిలు తినిపించి ఆశీర్వదించి సోదరులచే కానుకలు అందుకున్నారు. ఉమ్మడి పుల్కల్ మండలంలోని పుల్కల్, చౌటకూరు మండలాల్లోని ఆయా గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. అత్తారింటికి వెళ్లిన అడపడుచులు తమ పుట్టింటికి చేరుకుని సోదరులకు రాఖీలు కట్టారు.

### ఎమ్మెల్యే పండగ శుభాకాంక్షలు

రఖీ పండగను పురస్కరించుకుని గురువారం అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ నియోజకవర్గ ప్రజలకు రక్షా బంధన్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి మండలంలోని ఆయా గ్రామాల నుంచి బిఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే స్వగృహానికి చేరుకురి రాఖీలు కట్టి పండగ శుభాకాంక్షలు తెలిపారు.

### న్యాల్‌కల్ మండలంలో..

**న్యాల్‌కల్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన న్యాల్‌కల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం రక్షా బంధన్ కార్యక్రమాన్ని ఆనందోత్సవాలతో సంతోషాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. అత్తారింటికి వెళ్లిన ఆడపడుచులు తమ పుట్టింటికి, ఉద్యోగాల కోసం వలస వెళ్లిన వారు ఉద్యోగాలకు సెలవులు పెట్టుకుని తమ స్వగ్రామాలకు చేరుకుని సోదరులకు రాఖీలు కట్టి నోటిని మిఠాయిలతో తీపి చేసి ఆశీర్వదించి సోదరుల నుంచి కానుకలు అందుకుని పండగను ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. పౌర్ణమితో ఆయా గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో సందడిగా మారా యి.

### సోదరులకు రాఖీ కట్టిన కార్పోరేటర్

**రామచంద్రాపుం, ఆగస్టు 31, ప్రభాతవార్త:** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం భారతీ నగర్ డివిజన్ కార్పోరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి తన సోదరుడు సమరసింహారెడ్డికి రాఖీ కట్టి ఆశీర్వదించారు. సోదరుడికి రాఖీ కట్టి నోటిని మిఠాయితో తీపి చేసి పండగ శుభాకాంక్షలు తెలిపారు.

### మనూర్ మండలంలో..

**మనూర్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మనూర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం రక్షాబంధన్ కార్యక్రమాన్ని ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. అత్తారింటికి వెళ్లిన మహిళలు తమ పుట్టింటికి చేరుకుని సోదరులకు రాఖీలు కట్టి నోటిని స్వీట్లతో తిపి చేసి ఆశీర్వదించి పండగ శుభాకాంక్షలు తెలిపారు. రాఖీలు కట్టుకున్న సోదరులు తమ సోదరీమ ణులకు కానుకలు అందించి పండగ శుభాకాంక్షలు తెలిపారు.

### పాపన్నపేట మండలంలో..

**పాపన్నపేట, ఆగస్టు 31, ప్రభాతవార్త:** రక్షా బంధన్ పర్వదినాన్ని మండల కేంద్రమైన పాపన్నపేటతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. ఆత్తారింటికి వెళ్లిన ఆడపడుచులు, ఉద్యోగాల కోసం వలస వెళ్లిన వారు తమ తమ గ్రామాలకు చేరుకుని సోదరులకు రాఖీలు కట్టి మిఠాయిలతో నోటిని తీపి చేసి ఆశీర్వదించి పండగు శుభాకాంక్షలు తెలిపారు. రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల నుంచి ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయానికి చేరుకుని అమ్మవారి దర్శించుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి.



సోదరుడికి రాఖీ కడుతున్న భారతీనగర్ కార్పోరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి



సోదరుడికి రాఖీలు కడుతున్న సోదరీమణులు

## ముఖం చాటేసిన వరుణుడు

### ఆందోళనలో అన్నదాతలు



రైతులు సాగు చేస్తున్న పంటలు ఎండిపోతున్న దృశ్యం

**కంగ్టి, ఆగస్టు 31, ప్రభాతవార్త:** మండలంలో వరుణుడు ముఖం చాటేయడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. రైతులు సాగు చేసిన పంటలు అనావృష్టితో ఎదుగుదల లేక నీరసించిపోతున్నాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు 58వేల 469 ఎకరాల్లో పంటలను సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు రికార్డులు దృవీకరిస్తున్నాయి. 22వేల 928 ఎకరాల్లో పత్తి, 13వేల 705 ఎకరాల్లో సోయ, 13వేల 220 ఎకరాల్లో కంది, 1837 ఎకరాల్లో మినుము, 1838 ఎకరాల్లో పెసర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. రైతులు వరాధార పంటలు సాగు చేస్తుండటం, వరుణులు కానరాకుండా పోవడంతో పంటలు ఎదగలేక అక్కడే ఎండుముఖం పడుతుంటంతో రైతులు ఏమి చేయాలో తెలియన అయోమయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. బసవేశ్వర ప్రాజెక్టు ఎప్పుడు నిర్మాణం అయి తాము సాగు చేసుకుంటున్న పంటలకు సారు నీరు అందిస్తారో అని రైతులు ఎదురుచూస్తున్నారు. జులైలో అధిక వర్షంతో, ఆగస్టులో వర్షాభావంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

## విజయవంతమైన ఉచిత మెగా వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న విగ్రం శ్రీనివాస్‌గౌడ్

**పెద్దశంకరంపేట, ఆగస్టు31 ప్రభాతవార్త:**
పెద్దశంకరంపేటలో గురువారం విగ్రం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ వైద్య శిబిరం గురించి ముందుగానే విస్తృత ప్రచారం చేయడంతో పెద్దఎత్తున వివిధ గ్రామాల నుంచి హాజరైన ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకొని ఉచితంగా మందులు పొందారు. శిబిరం నిర్వహణ పట్ల రోగులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని విగ్రం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్టు చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కేంద్ర ఫుడ్ కార్పోరేషన్ డైరెక్టర్ విగ్రం శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విగ్రం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ నిరుపేదలకు సేవ చేయడమే ఈ ట్రస్టు ముఖ్య ఉద్దేశం అన్నారు. మరెన్నో సేవా కార్యక్రమాలను ఈ ట్రస్టు ద్వారా చేపడుతామని తెలిపారు. ఇందులో ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. ఈ వైద్య శిబిరానికి సమకరించిన సన్ సీడ్ ఆసుపత్రి కుషాయిగూడ యాజమాన్యానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గంగాధర్‌గౌడ్, కృష్ణమూర్తి, రాజన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపి బిబి పాటిల్‌కు రాఖీ కడుతున్న జడ్పీటిసి సభ్యురాలు స్వప్న భాస్కర్

## జర్నలిస్టు ఆత్మహత్య.. ఖాజా విరాహత్ అలీ పరామర్శ

**గజ్వేల్, ఆగస్టు 31 (ప్రభాతవార్త):** గజ్వేల్ కేంద్రంగా ఓ దినపత్రికలో పనిచేస్తున్న జర్నలిస్టు వేణుమాధవ్(34) బుధవా రం సాయంత్రం పట్టణంలోని ఎర్రకుంటలో శవమై కనిపించాడు. సోమవారం ఉద యం ఇంటి నుండి బయటకు వెళ్ళిన వేణు బుధవారం వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు దర్యాప్తు చేపట్టగా పట్టణ శివారులోని ఎర్రకుంట చెరువులో మృతదేహాన్ని కనుగొన్నారు. జర్నలిస్టు వేణుమాధవ్ ఆత్మహత్యకు కారణం ఆన్‌లైన్‌లో అప్పుల భారం ఎక్కువ కావడమేనని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు. వేణుమాధవ్‌కు భార్యతో పాటు రెండేళ్ళలోపు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఇదిలా ఉండగా సమాచారం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఖాజా విరాహత్‌అలీ గజ్వేల్‌కు చేరుకొని వేణుమాధవ్ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టియూడబ్ల్యూజే సంఘంలో క్రియాశీలకంగా పనిచేస్తున్నాడని, వేణు అకాల మరణం తీరని విషాదాన్ని మిగిల్చినట్లు తెలిపారు. వేణు కుటుంబానికి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వేణు ఆత్మహత్యకు కారకులైన వారిని వెంటనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విరాహత్ అలీతో పాటు గజ్వేల్ పట్టణంలో ఉన్న పలువురు జర్నలిస్టులు వేణు మృతదేహాన్ని పరిశీలించి సంతాపం తెలిపారు.

## ఐటిఐలలో ప్రవేశానికి గడువు పొడిగింపు

**సంగారెడ్డి మున్సిపాలిటి ఆగస్టు 31 ,ప్రభాతవారత్త:**
ప్రభుత్వ ఐటిఐలలో ప్రవేశం కోరకు దరఖాస్తు గడువును సెప్టెంబరు 2,వరకు పొడిగించినట్లు సంగారెడ్డి ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ కె.రాజేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సి ఉత్తీర్ణులైన విద్యార్థిని, విద్యార్థులు అన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## మట్కా నిర్వాహకుడి అరెస్టు

**న్యాల్‌కల్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** మట్కా జూదం నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి రాము నాయుడు పేర్కొన్నారు. ఎస్ఐ కథనం ప్రకారం... మండలంలోని రాజోలా గ్రామానికి చెందిన దప్పూర్ కిష్టాగౌడ్ (38) మట్కా నిర్వహస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకుని కిష్టాగౌడ్‌ను అదుపులోకి తీసుకుని మట్కా బుక్కీని, 3వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సుమోటో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము నాయుడు పేర్కొన్నారు.

## మండల ప్రజలకు ఎస్ఐ రాఖీ శుభాకాంక్షలు

**ఝరాసంగం, ఆగస్టు 31, ప్రభాతవార్త:** రక్షా బంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం ఎస్ఐ రాజేందర్‌రెడ్డి మండల ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు ఠాణా పరిధిలోని ఆయా గ్రామాల నుంచి ఆయా పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో ఠాణాకు చేరుకుని ఎస్ఐ, ఎఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, సిబ్బందికి రాఖీలు కట్టారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బందది గోపాల్‌రెడ్డి, సాయికృష్ణ, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

## గొల్లకురుమల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

### -ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

**జగదేవ్‌పూర్, ఆగస్టు 31 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్రంలోని గొల్లకురుమలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు బిఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని వట్టిపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రెండవ విడత 19 యూనిట్ల గొర్రెల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రతాప్‌రెడ్డి గొల్లకురుమలకు గొర్రెలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గొల్లకురుమల అభివృద్ధి కొరకు ముఖ్యమంత్రి కెసిఆర్ రాయితీపై గొర్రెలను పంపిణీచేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, అందులో భాగంగా రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఉన్న గొల్లకురుమలకు దశల వారీగా గొర్రెలను అందిస్తున్నారని, దీని ద్వారా గొల్లకురుమలు స్వయం ఉపాధితో ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షుడు భూమ విజయ్‌కుమార్ ముదిరాజ్, బిఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి, పిఎసిఎస్ డైరెక్టర్ జశ్వంత్‌రెడ్డి, గ్రామ రైతుబంధు అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ పిట్టల సత్యనారాయణ, యాదవ సంఘం అధ్యక్షుడు కనకయ్య, ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి రాములు, నాయకులు దేవదానం, కనకయ్య, శివారెడ్డి, భూపతిరెడ్డి, పోచయ్య, గోపాలమిత్ర సర్వర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



గొర్రెలు పంపిణీ చేస్తున్న ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



కేతకి ఆలయానికి బెంచీలు, టేబుల్‌లు అందచేసిన దాతను సన్మానిస్తున్న అర్చకులు

## కేతకి ఆలయానికి దాత గణేశ్ సహకరాం

**ఝరాసంగం, ఆగస్టు 31, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఝరాసంగంలో పార్వతీ దేవి సమేతంగా కొలువన్న శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయానికి చాపోలి గ్రామానికి చెందిన గణేష్ మద్రేవార్ బెంచీలు, టేబుల్‌లను అందచేశారు. ఆలయానికి ఆయా ప్రాంతాల నుంచి నిత్యం భక్తులు వస్తూ ఉంటారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు ఆలయ ఆధ్వర్యంలో, దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారు. అన్నదానంను భక్తులు నిల్చుని భోజనం చేయాల్సి వస్తుండటంతో దాత గణేశ్ భక్తుల కష్టాలను కడతేర్చేందుకు అవసరమైన బెంచీలు, టేబుల్‌లను ఆలయానికి అందచేశారు. అంతకు ముందు దాత గణేశ్ ఆలయంలో అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు దాత గణేశ్‌కు ఆశీర్వచాలను చేసి తీర్థ ప్రసాదాలు అందించి జ్ఞాపికను అందచేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు బసవయ్యస్వామి, రికార్డు అసిస్టెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌వోసీ అందజేసిన ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి




ఎల్‌వోసీ అందజేస్తున్న ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి

**మెదక్ అర్బన్, ఆగస్టు331 ప్రభాతవార్త:**
మెదక్ మండల పరిధిలోని రాజ్‌పల్లి గ్రామానికి చెందిన వై. అరుణ్ తండ్రి వై. దుర్గేష్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి దృష్టికి స్థానిక నాయకులు తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2,50,000 ఎల్‌వోసీ నిమ్స్ హాస్పిటల్‌కు మంజూరు చేయించారు. ఈ మేరకు గురువారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎల్‌వోసీ పత్రాన్ని ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, మెదక్ వైస్ ఎంపీపీ మార్గం ఆంజనేయులు, మెదక్ మండల రైతుబంధు అధ్యక్షులు కిష్టయ్య, నాయకులు ఎలక్షన్‌రెడ్డి, దొంతి నారాయణ ఉన్నారు.

## కొల్చారంలో ఘనంగా రక్షాబంధన్



తమ్ముడికి రాఖీ కడుతున్న అక్కాచెల్లెలు

**కొల్చారం, ఆగస్టు31 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కొల్చారంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో గురువారం రాఖీ పౌర్ణిమ సందర్భంగా అక్కా తమ్ముళ్లు, అన్నా చెల్లెళ్లు రాఖీలు కట్టుకుని ఘనంగా జరుపుకున్నారు. అనంతరం అక్కా, చెల్లెళ్లు అన్న, తమ్ముళ్లకు హారతి ఇచ్చి స్వీట్లు తినిపించి రాఖీలు కట్టారు. ప్రేమానురాగాలకు, ఆప్యాయతకు ప్రతీకైన రాఖీ పండుగను ప్రజలందరూ ఘనంగా జరుపుకున్నారు.